## పెద్దలకు మాత్రమే (ఒంగోలు కథలు -13) - by పార్థు

Back Home

ఈ పేజీని పంపండి

ఈ కథ చెప్పే ముందు, కొంత మా ఇంటి, చుట్టుపక్కల వాతావరణం గురించి చెప్పాలి.

మా ఇంట్లోనో, లేదా కాలనీ లో పక్క వాళ్ళింట్లో నో కలిసి కూర్చుని TV/VCP లొ సినిమా లు చూస్తున్నప్పుడు కొన్ని పెద్దల కు మాత్రమే సన్నివేశాలు వచ్చేవి. అలాంటి సన్నివేశాలు వచ్చేప్పుడు ఇంట్లో వాళ్ళంతా అప్పుడే ఏదో పనులు వున్న వాళ్ళ లా లేచి వంటింట్లోకో వసారా లోకో వెళ్ళే వాళ్ళు (రిమోట్ సౌకర్యం వుండేది కాదు కనుక చానెల్ మార్చడానికి). అది కుదరని పక్షం లో "ఈ మధ్య సుబ్బారావు పాలు సరిగ్గా పోయటం లేదండి, నీళ్ళు ఎక్కువ కలుస్తున్నాయ్" అంటూనో, "వచ్చె నెల DA ఇస్తాడు ట గదా ఎంత వరకు రావచ్చేంటి" అనో టాపిక్ మార్చేసేవాళ్ళు.

పిల్లలమేమో "అదే పని గా చూస్తే ఎక్కడ తగులుతాయో అని" పుస్తకాల గూడు వైపు వెళ్ళే వాళ్ళం temparary break కోసం.

మరికొన్ని చెప్పుకోవాలంటే,

వేసవి కాలం ఆరుబయట మంచాలేసుకుని పడుకుంటే 6 లోపే లేపేసి లొపలికెళ్ళి పడుకోండి అనే వాళ్ళు ఆమ్మాయిలైనా, అబ్బాయిలైనా. అత్తయ్య గారు, మామయ్య గారు అని పిలుస్తూనే పక్కింటి వాళ్ళని, అన్నయ్యనో, అక్కయ్యనో అని పిలుచుకునే వాళ్ళం పిల్లలం.

ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, యువ(monthly), విజయచిత్ర ( సినిమా పత్రిక), ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి మాత్రమే అర్హత సంపాదించాయ్ official గా కొనడానికి, చదవడానికి అప్పట్లో. స్వాతి, మయూరి లాంటివి పక్క వాళ్ళు ఇస్తేనో, వూరి నుండి వచ్చిన చుట్టాలు తెస్తేనో మాత్రమే చదువుకోడానికి సౌకర్యం కలుగచేసారు.

అలాంటి వాతావరణం అది.

ఇహ కథ లోకి వద్దాం....

అప్పుడే మా batch యవ్వనం లోకి ప్రవేశించాం.

శీను గాడు మా batch లొ దేశముదురు టైపు. వాడికి "అన్ని" విషయాల మీద అవగాహన వుండేది. "వజ్రాయుధం" పాట లొ మా అందరి దృష్టి కృష్ణ మీద వుంటే, వాడు మాత్రం చప్పుడు కాకుండా "చిలకలని" ని చూస్తుండేవాడు (ఈ విషయం థియేటరు బయటకు వచ్చిన తర్వాత వాడే సభాముఖం గా ప్రకటించేవాడు).

మేం సితార, శివరంజని కోసం కొట్టుకు చస్తుంటే, వాడు "సినీ కమాండో, సినీ డిటెక్టివ్" అంటూ అవేవో పత్రికలు ఎక్కువ గా చదువుతుండే వాడు. అలాగే, మేము "సామ్రాట్, సాహస సామ్రాట్, వీర ప్రతాప్,కంచు కవచం, ఉక్కు సంకెళ్ళు" లాంటి సినిమా ల కోసం వెంపర్లాడే రోజుల్లోనే, వాడు

మాత్రం "అడవి లో ఆర్తనాదం", అర్ధరాత్రి హత్యలు" ఇంటి నంబెర్ 13", "కనుక్కో, ఏం జరిగిందో" లాంటి డబ్బింగ్ సినిమాలు ఎక్కువ చూసేవాడు. అర్ధముయి చచ్చేది కాదు ఎందుకు అవే ఎక్కువ గా చూసేవాడో.

అసలు గుట్టు విప్పడం తో, మిగిలిన వాళ్ళ నోళ్ళు తెరుచుకున్నాయ్.

"ఎలా చూస్తార్రా, సిగ్గు లేకుండా?" అడిగాడు లెక్కల మాస్టారి శీను.

"సిగ్గు అక్కరలేదు , కళ్ళు వుంటే చాలు" గీతోపదేశం చేసాడు దేశ ముదురు.

"కళ్ళే కాదు ఖలేజా కూడ వుండాలి, తెలిస్తే తంతారు మా ఇంట్లో" చెప్పా నేను.

"తెలియకుండా మానేజ్ చేస్తే?" కొద్ది గా మెత్త బడ్డాడు రమేష్ గాడు.

"కష్టం రా" అన్నాడు దూద్ పేడా శీను గాడు

"దానికి నా దగ్గర ఒక ప్లాన్ వుంది" చెప్పాడు ధీర్ఘం గా ఆలోచించి దేశ ముదురు గాడు.

"మీరు స్టార్ట్ చేసిన 5,10 నిమిషాల తర్వాత వస్తారు, చీకట్లో ఎవరి కీ కనపడరు" చెప్పాడు

"ఎక్కడ కూర్చున్నావో నువ్వైనా కనపడతావా అసలు?" ఆరా తీసాడు ఆదుర్దాగా రమేష్ గాడు

"తలుపు తెరుచుకున్న ప్రతి సారి చూస్తుంటా, మీరు రాగానే ఎదురొస్తా" చెప్పాడు వాడు

"మామూలు సినిమాలకెళ్ళినప్పుడే ఎన్నో సార్లు మమ్మల్ని వదిలేసావ్ మధ్య లో, ఇలాంటి చోట స్పృహ వుంటుందా అసలు నీకు?" అడిగాడు అనుమానం గా రమేష్

"అయినా అసహ్యం గా ఉదయం ఆట ఒక్కటే వెయ్యడమేంట్రా?" అడిగాడు లెక్కల మాస్టారి శీను.

" ధియేటరు లోకి దూరేటప్పుడు మాత్రమే, మీరు ముందు వెనుక బాగా చూసుకుని దూరాలి తెలిసినున్న వాళ్ళు కనపడకుండా. అయినా office లు, college లు టైమే కాబట్టి 99% తెలిసున్న వాళ్ళు తగలరు" చెప్పాడు అనుభవం తో.

"అదృష్టం బావుంది చిన్న గల్లీ లో వుంది, లేకపోతే ఈ మాత్రం కూడ work out అవదు" చెప్పాడు మళ్ళీ వాడే

"ఇదేదో బానే వుంది రా.." దూద్ పేడ శీను గాడి కి ధైర్యం వచ్చింది.

నాకు, లెక్కల మాస్టారి శీను కి ఇంకా ధైర్యం రాలా, మలేరియా వచ్చినవాళ్ళ లా వణక సాగం.

"భయమేస్తొంది రా.." అన్నాం.

"ఒకవేళ పొరపాటున దొరికిపోతే , నన్ను పిలిచుకెళ్ళడానికి వచ్చామని చెప్పండి" అంటూ ఇంకో బాణం వేసాడు.

"అన్ని రకాలు గా ఆలోచించాం కాబట్టి ఆ మాత్రం రిస్క్ తీసికోవాలి కావాలంటే" తప్పదు అన్నారు మిత్ర త్రయం.

ఆ ముహూర్తం రానే వచ్చింది.

అంతా సజావు గానే జరిగింది లోపలకి ఎంటర్ అయ్యే వరకు.. అక్కడే తన్నింది.

ప్రొజెక్టర్ సహకరించనందున పొరపాటున మేము దూరే సమయానికి ఇంకా లైట్స్ అవీ వేసే వున్నాయ్, సినిమా నడవటం లా...

జనాలు కాళ్ళు బార్లా జాపుకుని కూర్చుని " ఒన్స్, బుస్సా " అంటూ మూలుగుతున్నారు.

"రేయ్! కెమిస్ట్రీ లాబ్ అసిస్టెంట్ భద్రం రా, ..", "రేయ్! ఇటు చూడు, బైపు ఇనిస్టిట్యూట్ సత్య మూర్తి గారు కూడా వున్నారు రా", "తలలు దించండహే పై row లో పక్క వాటా వాళ్ళ అబ్బాయ్ రామకృష్ణ వున్నాడు. దేశం లో వున్న పరిచయస్తులంతా అక్కడేదో అంతర్జాతీయ art exhibition జరుగుతుంటే వచ్చినట్టు తగలడ్డారు.

ముచ్చేమంటలు పొయ్యటం ప్రారంభించాయ్. ఎప్పుడెప్పుడు లైట్స్ off చేస్తాడా అని మొక్కుతూ కూర్చున్నాం. ముందు ఖాళీ సీట్ లు, పక్క ఖాళీ సీట్ లు మమ్మల్ని మరింత భయపెట్టసాగాయ్. తలుపు చప్పుడు అయితే చాలు, తాండ్రపాపారాయుడు కళ్ళ ముందు కనిపించినట్టు అయ్యింది పరిస్థితి. తెలుసున్న వాళ్ళు రాకూడదని ఒక వేడుక, వచ్చినా ఈ పక్క సీట్ లోకి రాకూడదని మరో విన్నపాలు భగవంతుడికి. సామూహిక ప్రార్ధనలు జరుగుతున్నాయ్ ఆందోళనలతో. ఆపరేటర్ అన్నయ్యకి దణ్ణాలు మొదలయ్యాయి తొందర గా లైట్లు ఆపి సినిమా వెయ్యమని.

మా టీమ్ కెప్టెన్ మాత్రం "పిల్ల సన్నాసులు, భయపడి చస్తున్నారు, ఇలాంటి సినిమాలు చూడాలి అంటే మనలా ఖలేజా వుండాలి " అంటూ జిలేబి తింటూ చక్కా కూర్చున్నాడు.

చిన్న గా ఆట మొదలయ్యింది.

ప్రేక్షకులు లీనమయి పోయారు, పక్కవాడి వైపు తల తిప్పితే ఏమి మిస్ అయిపోతామో అన్నంత సిటారుగా కూర్చుని దీక్ష గా చూడటం మొదలెట్టారు. ఆ అకుంఠిత దీక్ష, దక్షత చూస్తుంటే, తెర ఎక్కడ తగలబడిపోతుందో అనిపించక మానదు.

పిండ్రాప్ సైలెన్స్ థియేటర్ అంతటా.

ఇంకా రక్తి కట్టించే సన్నివేశాలు రాలా. కొంత మంది కి అయితే అనుమానం, అంత డబ్బెట్టి కొన్నాం టికెట్, అసలు వస్తాయా రావా అన్న బెంగ. ఇలాంటి సతమత వాతావరణం లో, విపత్కర పరిస్థితులలో, ఆ సినిమా స్క్రీన్-ప్లే రచయిత ఎవడో కాని సాగ దీసుకుపోతున్నాడు సెంటిమెంటి సీన్ లతో.

అదో గొప్ప కరుణరాసాత్మక చిత్రం..చిత్ర కళారాజం, గొప్ప కథాబలం, నటీ నటవర్గం కల చిత్రం. డైరెక్టర్ ఊహల కి మించి పోయి నటిస్తున్నాడు ప్రతి ఒక్కడు. కిక్కురమనలేని పరిస్థితి ప్రతి ఒక్కడిదీ థియేటరు లో.

ఇది చాలదు అన్నట్టు మధ్య లో పవర్ పోయింది ఒకసారి, ఉదయం ఆట, పైగా వుక్క. ధారాళమైన గాలి, వెలుతురు కోసం అన్ని తరగతుల ప్రేక్షకులు తలుపులు అన్నీ బార్లా తెరిచారు.

కాసేపు థియేటరు యాజమాన్యం జెనరేటరు తొ కుస్తీ పడ్డాక, మళ్ళీ మొదలయ్యింది ఆ ఆస్కార్ గ్రహీత.

ఈ సారి రచయిత కుటిల రాజకీయాలు, దేశం లో జరుగుతున్న ఆరాచకాల మీద తన పెన్ను కున్న పవర్ చూపించడం మొదలెట్టాడు. ఒక తరగతి ప్రేక్షకులలొ కోరిక నశిస్తే, ఇంకో తరగతి ప్రేక్షకుల లో ఓపిక నశించింది. ప్రచురణ సాధ్యం కాని పదజాలాన్ని ప్రయోగించడం మొదలెట్టారు టికెట్ కొన్నామనే కసి తో.

సరిగ్గా అదే సమయం లో కథ కు సంబంధం లేకుండా, కేస్ కి సంబంధం లేని సాక్షి లా, ఎక్కడ నుండో వచ్చి తెర మీద పడిందో బొమ్మ. అప్పటికే పెద్ద నటీ నటవర్గం తో కన్ ఫ్యూస్ అయిపోయిన మాకు సడెన్ గా ఈ కొత్త కారెక్టర్ల చూసే సరి కి రచయిత కథ ని ఎలా మలుపుతిప్పబోతున్నాడబ్బా అని ఆలోచిస్తూ కూర్చున్నాం.

జన ప్రవాహిని లో సందడి మొదలయ్యింది..ఇందాక ఆపరేటర్ అన్నయ్య మీద కేకలు వేసిన జనం, ఇప్పుడు, జే జే లు, జిందాబాద్ లు కొడుతూ ఈలలు వేస్తున్నారు. గట్టి గా 4 సన్నివేశాలు మారాయో లేదో, తెర సడెన్ గా తెల్ల గా అయిపోయింది. ఆపరేటర్ రూమ్ లో డోర్ పెద్ద గా చప్పుడైన శబ్దం. కొంత కలకలం మేడ మీద. కింద కళాభిమానుల గుసగుసలు. ఈ ఉద్వేగ వాతవరణం లో ఎవడో పెట్టాడు పెద్ద గా కేక "పోలీసోల్లు వచ్చారంట"

మాకు భలే ముచ్చటేసింది పోలీసులు కూడా పని మానుకుని వచ్చారంటే ఈ సినిమా లో తప్పక ఏదో విశేషం వుండి తీరాలి అనిపించింది. రచయిత మీద నమ్మకం మరింత బలపడసాగింది.

వాళ్ళొచ్చింది చూడ్డాని కి కాదురా, చావ బాదడాని కి అని దేశ ముదురు దానయ్య చెపితే కాని అర్ధం కాలా

పక్కన చూస్తే శీను గాడు జంప్..చీకట్లో ఎప్పుడు చెక్కేసాడో తెలియలా.

ముందు ఆహార పొట్లం తనకే అందాలని, వరద భాధితులు ఎలా పరిగెడతారో అప్పుడే నాకు

మొదటి సారి గా అర్ధమయ్యింది

లాటీ లు, టోపీ లు తలుపులు మూయ్యక ముందే, జనం తోసుకు బయటపడ్డారు

ఆ తోపులాట లో, తొక్కిసలాట లో, బైపు మాస్టరు, కుంగ్ ఫూ మాస్టరు అనే తేడా ఏ లేదు , ఆత్మ రక్షణార్ధం, ఒకళ్ళ మీంచి ఒకడు దాటుకు పోవాలన్న తాపత్రయమే.

అక్కడ పరిగెడితే, పక్కన hotel దగ్గర కూలపడ్డాం

తల ఎత్తుకుని దర్జా గా చూడాల్సిన సినిమా లు ఇలా తలదించుకుంటూ, నడుం వంచుకుంటూ ( ఎవరి కి కనపడకుండా) చూడ్డమేంటో అర్ధం కాలా!

అది సహజం గా వచ్చిన బెరుకు వల్లో, ఇంట్లో వాళ్ళంటే భయం వల్లో, ఈ దెబ్బ తిని వుండటం వల్లో తెలియదు కాని ఇంత భయపడుతూ, తప్పు చేసామేమో అన్న ఫీలింగు తో, ఆదుర్దాగా చూడాలా ఇలాంటి సినిమాలు అనిపించింది మిగతా నలుగురికి.

ఆ అనుభవం పెద్ద పాటమే నేర్పింది, పద్దతేంటో చెప్పింది. అక్కడకక్కడే వొట్టేసుకున్నాం అట్టర్ ఫ్లాప్ అయినా సరే అచ్చ తెలుగు ఆంధ్రా సినిమాలే చూద్దామని.

* * *

ఇది జరిగిన కాసేపటి కి...

"ఉత్తదేనట్రా, ఇప్పుడే కనుక్కున్నా, పోలీసులు కాదటా , అందరు లోపలికెడుతున్నారు పదండి, ఇంతకీ రమేష్ గాడు ఏడి?" అంటూ వెనకనుండి వచ్చి చెయ్యేసాడు శీను గాడు.

"అలాగే వెడదాం, కాసేపాగు, మీ నాన్న గార్ని పిలుచుకురావడానికెళ్ళాడు వాడు" చెప్పాడు దూద్ పేడ శీను గాడు వెటకారం గా.

ఇది జరిగిన కొన్నేళ్ళ కి..

3 ఏళ్ళ తర్వాత, తొలిసారి గా ఇండియా వెడుతున్నా...

"ఏం తేన్రా?" అని ఫోన్ లు చేసినప్పుడు అడిగితే,

"నాకు డిజిటల్ డైరీ కావాలి, ఫలాన బ్రాండ్ సిగరెట్లు కావాలి, నాకు aiwa వాక్ మన్ కావలి, seiko వాచ్ కావాలి " అని ఇలా అడిగారు అందరూ వాడ్ని అడిగా అలానే.

"అక్కడ! అవేవో మాగజైన్సు అమ్ముతారట గదా , బట్టలు......"

"పురుషులలో పుణ్య పురుషులు వేరూ, కలి పురుషులలో ఆకలి పురుషులు వీరు..."రెండుజెళ్ళ సీత" లో పాట గుర్తొచ్చింది ఎందుకో.

* * *

ఒక్క క్షణం ఆగండి....

ఈ కథ నేను ఇక్కడి తో ఆపేయ్యొచ్చు, అలా చేస్తే సిసలైన వ్యక్తిత్వాన్ని చెప్పి, వాడి అసలైన వ్యక్తిత్వాన్ని దాచి ద్రోహం చేసినట్టు అవుతుంది

తను కోల్పోతోందేంటో త్వరగానే గ్రహించడం, తప్పుటడుగులనే, మెప్పుటడుగుల గా మార్చుకోవడం కొద్ది మంది కే సాధ్యమవుతూ వుంటుంది. అలాంటి వాళ్ళ లో వాడు ఒకడు.

ఆ క్షణమే, "పండిత పుత్రుడు పరమశుంఠ కానక్కరలేదు" అన్న దిశ గా అడుగులు పడటం ప్రారంభించాయ్. "ఇంతటి తో అయ్యో అంతా అయిపోయిందే" అని వాడు అనుకోలేదు ( మధ్య లొ 2 ఏళ్ళు చదువు ఆగి పోతే), తన తోటివాళ్ళే తన కి సీనియర్స్ అయినా వెనుకంజ వేయలేదు, ఎలా ఎదగాలా అని మాత్రమే అలోచించాడు.

ఫలితమే, KITS లొ M.Sc(Maths) గొల్డ్ మెడల్ సంపాదించి, Bank Regional office లో operations-Head గా ఎదిగాడు అతిత్వర లొనే.

"ఏం!, అంత కష్టమా ఏంటి programming చెయ్యడం, అంటూ after hours లో computer తో కుస్తీ పట్టి certifcations చేసిన దేశ ముదురు గాడు.

మంచినీళ్ళు తాగినంత తేలిక అని ధైర్యం చెప్పి, నేను వెళ్ళలేకపోయాను IT లోకి, కనీసం నువ్వైనా వెళ్ళాలి అంటూ పట్టుదల తో భార్య ని M.Sc (IT) చేయించి, ఉద్యోగం తెప్పించి పెట్టాడు.

ఇవన్నీ ఒక ఎత్తు, పుట్టిన తన బిడ్డ ని చూసుకోవడాని కి అత్త గారింటికి వెడుతున్న తన అన్నయ్య ని హైవే మీద లారీ గుద్దేసి చంపేస్తే, అలా దిక్కులేకుండా అయిపోయిన ఆ ఫామిలి కి, పెద్ద కొడుకు పోయిన పుట్టెడు శోకం లో తమ ఆరోగ్యం దిగజార్చుకున్న తలితండ్రులు కోసం ఇంటి కి పెద్ద దిక్కు గా నిలవడం కోసం అన్నీ వొదులుకుని ( ప్రమోషన్, భార్య జాబ్, మెట్రో జీవితం etc) తన వారి కి తోడు గా నిలవడం కోసం తమ భవిష్యత్ నే తిరిగి మార్చుకున్నాడు

వాడు.. మా దేశ ముదురు గాడు, మా శీను గాడు

పార్థూ

* * * End * * *

మీ సూచనలూ, సలహాలు రచయిత పార్థు కి తెలియచేయండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి